# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 20-11-2024 | సంపుటి : 06 | సంచిక : 52 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## ప్రభుత్వ అనుమతి లేకుండా కల్వరి టెంపుల్ నిర్మాణాలు

### కల్వరి టెంపుల్‌పై హైకోర్టులో పిటిషన్

అమరావతి,నవంబర్19: కల్వరి టెంపుల్‌ను ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మించారంటూ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గుంటూరు జిల్లా నంబూరులో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కల్వరి టెంపుల్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవు అంటూ పరస సురేష్ కుమార్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా వందల కోట్లతో కట్టడాలు నిర్మించారని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. సీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రమాదకరమైన కట్టడాలు నిర్మించటం చట్టవిరుద్ధం అని న్యాయవాది వాదనలు వినిపించారు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# వాడివేడిగా సాగిన ఏపీ శాసనమండలి



### పలు అంశాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాలమధ్య మాటల యుద్ధం
### దనపల్లె ప్రభుత్వ దస్త్రాల దహనం అంశం విమర్శలు
### కేసులో ఎలాంటివారున్నా వదిలిపెట్టేది లేదన్న మంత్రి
### రుషికొండ ప్యాలెస్ వ్యవహారంపైనా వాడివేడిగా చర్చ

అమరావతి,నవంబర్19 మదనపల్లె ప్రభుత్వ దస్త్రాల దహనం అంశం శాసనమండలిని కుదిపేసింది. ఈ కేసులో ఎలాంటివారున్నా వదిలిపెట్టేది లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం సభలో మదనపల్లె దస్త్రాల ఘటనకు సంబంధించి టీడీపీ సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై మాట్లాడిన రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేరు ప్రస్తావించారు. వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం చోటు చేసుకుంది.విచారణ జరుగుతున్న సమయంలో వ్యక్తుల పేర్లు ఎలా ప్రకటిస్తారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సభ్యులపై బురద జల్లడం సరికాదన్నారు. రికార్డుల నుంచి ప్రకటించిన వ్యక్తుల పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈలోగా ఛైర్మన్ జోక్యం చేసుకుని సభ్యులను వారించే ప్రయత్నం చేశారు. వ్యక్తుల పేర్లు వెల్లడించకుండా మాట్లాడాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ నోరు విప్పారు. సీఐడీ దర్యాప్తులో ఉన్న అంశాలను తాను ప్రస్తావించానని అన్నారు. మొత్తం 2,400 ఫైళ్లకు నిప్పు పెట్టారని తెలిపారు. ఘటన విషయం తెలియగానే అధికారులు, పోలీసులు అక్కడి వెళ్లారని తెలిపారు మంత్రి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దస్త్రాలు తగలబడినట్టు అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. కుట్ర పూరితంగా ఘటన జరిగినట్టు కనిపించిందన్నారు. సీసీటీవీ కెమెరా అప్పుడు పని చేయకపోవడం, మోటారు ఆయిల్ అక్కడ ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో సీఐడీ దర్యాప్తుకు ఆదేశించామన్నారు. ఘటనలో కొందరి మాజీ అధికారుల పేర్లు ప్రస్తావించారు మంత్రి అనగాని. వీరంతా మాజీ మంత్రి అనుచరులుగా ఉన్నారని వివరించారు. దీనిపై సీఐడీ లోతుగా విచారణ చేస్తోందని, దాన్ని నిర్ధారించాల్సి వుందన్నారు. మదనపల్లెలో మొత్తం 13, 445 ఎకరాలు ఉండగా, చట్ట ప్రకారం జరిగింది 8,882 ఎకరాలని అన్నారు. చట్ట ప్రకారం కాకుండా 4,500 ఎకరాలని తేల్చి చెప్పారు మంత్రి అనగాని సత్యప్రసాద్. సాక్ష్యాలను బూడిద చేశారన్నారు. అందులో నుంచి అసలు విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. మరోవైపు రుషికొండ ప్యాలెస్ వ్యవహారంపై వైసీపీ డిఫెన్సులో పడిపోయింది. మంత్రుల నుంచి ఎదురుదాడి మొదలుకావడంతో ఏం చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. చివరకు వాటిని వైసీపీ ప్రభుత్వ భవనాలుగా తేల్చేసింది. ప్రభుత్వం మీద.. ఏం చెయ్యాలో చేసుకోండంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు వైసీపీ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ. రుషికొండ ప్యాలెస్ అంశంపై మండలిలో ఎమ్మెల్సీ రామారావు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ సందర్భంగా టూరిజం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. అక్కడ హరిత రిసార్ట్స్ వల్ల ఏడాదికి 7 కోట్లు నుంచి 16 కొట్ల వరకు ఆదాయం వచ్చేదన్నారు. 58 గదులతో అద్భుతమైన హరిత రిసార్ట్స్ ఉండేదన్నారు. వాటిని పడగొట్టి ప్యాలెస్‌ను కట్టారన్నారు. దీనివల్ల రుషికొండకు అపారమైన నష్టం కలిగిందన్నారు. రాష్ట్రంలో ఈ తరహా బీచ్ ఎక్కడా లేదన్నారు. ప్యాలెస్ కట్టి దాన్ని ఏడు బ్లాకులు విభజించారన్నారు. తొలుత అప్లికేషన్ పెట్టినప్పుడు బెటర్ రిసార్ట్స్ చేస్తామని చెప్పి, ఏడాది కిందట ముఖ్యమంత్రి నివాసమంటూ మాట్లాడారని దుయ్యబట్టారు సదరు మంత్రి. ఇందుకోసం 481 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. లోపల ఇంద్రభవనం మాదిరిగా ఉందన్నారు. బెటర్ రిసార్ట్స్ అన్నప్పుడు, నిర్మాణం సమయంలో మిగతావారిని ఎందుకు అనుమతించలేదని ఎదురుదాడి మొదలుపెట్టారు.జీవోలన్నీ ఒక్కసారి పరిశీలించాలని ఛైర్మన్‌కు వివరించారు మంత్రి దుర్గేష్. అన్నింటినీ మీ దగ్గర పెడతామన్నారు. దీనిపై తేల్చాలని మంత్రి డిమాండ్ చేశారు. ఓపెన్ డిబేట్‌కు మేం సిద్ధమేనని సవాల్ విసిరారు మంత్రి. ఎక్కువ ఏరియాను ధ్వంసం చేశారని, దీనిపై విచారణ జరుగుతోందని, త్వరలో నివేదిక వస్తుందన్నారు. ఈలోగా మంత్రి అచ్చె న్నాయుడు జోక్యం చేసుకున్నారు. 26000 ఎస్ఎఫ్‌టీలో ప్యాలెస్‌ను నిర్మించారన్నారు. అక్కడ ఖర్చు చేసిన నిధులతో 2,600 మంది పేదలకు ఇళ్లు కట్టించవచ్చన్నారు. ప్యాలెస్ చూస్తే గుండె ఆగిపోతుందన్నారు. మీరు వస్తామంటే బస్సు వేసి మిమ్మల్ని తీసుకెళ్లి చూపిస్తామన్నారు. క్షమాపణలు చెప్పాల్సిందిపోయి, ఎదురుదాడి చేస్తారా అంటూ మండిపడ్డారు మంత్రి.వెంటనే ప్రతిపక్ష నేత బొత్స మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాల కోసం కట్టామన్నారు. అందులో ముఖ్యమంత్రి లేదా ప్రధాని ఎవరైనా ఉండొచ్చనని అన్నారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ప్యాలెస్‌ను పరిశీలించారన్నారు.

# సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం అఫిడవిట్

### గత నాలుగేళ్లలో భారీగా ఇసుక దోపిడీ
### నాలుగేళ్లలో 46.52 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమ తవ్వకాలు




న్యూఢిల్లీ, నవంబర్ 19 : ఏపీలో గత నాలుగేళ్లలో 46.52 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక దోపిడీకి గురైనట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అఫిడవిట్‌ను సమర్పించింది. గూగుల్ ఎర్త్ ప్రో ఇమేజెస్ ద్వారా ఇసుక దోపిడీని ప్రభుత్వం అంచనా వేసింది. 13 ఎఫ్ఐఆర్‌లను ఏపీ ప్రభుత్వం నమోదు చేసింది. గత నాలుగేళ్లలో 465.36 హెక్టార్లలో 46.52 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని... దాదాపు 63 కేసుల్లో వివిధ సంస్థలకు ప్రభుత్వం షోకాజు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. ఇసుక అక్రమ తవ్వకాలపై గతంలో జేపీ వెంచర్స్‌కు వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. జేపీ వెంచర్స్‌కు దాదాపు రూ. 18 కోట్ల జరిమానాను గ్రీన్ ట్రిబ్యునల్ విధించింది. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీంను జేపీ వెంచర్స్ ఆశ్రయించింది. సెప్టెంబర్ 13న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు తాజాగా రాష్ట్ర ప్రభు త్వం అఫిడవిట్ దాఖలు చేసింది. జీడీ స్టీరియో డేటా, 2డీ గూగుల్ ఎర్త్ ప్రో ఇమేజెస్‌ను ఉపయోగించి ఇసుక అక్రమాలను ఏపీ ప్రభుత్వం వెలు గులోకి తీసుకువచ్చింది. గత నాలుగేళ్లలో జరిగిన ఇసుక అక్రమా లన్నింటినీ 329 పేజీలలో సాక్ష్యాలతో సహా సుప్రీం కోర్టుకు ఏపీ ప్రభుత్వం వివరించింది

# గత ఐదేళ్లపాలనలో 20 ఏళ్లు వెనక్కి పోలవరం

### డయాఫ్రం వాల్ ఉందోలేదో తెలియదు
### మంత్రి నిమ్మల రామానాయుడు


అమరావతి,నవంబర్19(: ఏపీ అసెంబ్లీలో పోలవరం ప్రాజెక్టుపై చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు పోలవరం ప్రాజెక్టు గురించి వివరించారు. దయాఫ్రం వాల్ ఉందో లేదో తెలియకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఫేజ్ %-% 1, ఫేజ్ %-% 2 అని ఏ రోజూ మేం చెప్పలేదన్నారు. పోలవరంతో పాటుగా చింతలపూడి, హంద్రీనీవాలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్‌ను విధ్వంసం చేయడమే లక్ష్యంగా పని చేశారని విమర్శించారు.



2014-19 గత టీడీపీ పాలనలో 7 లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే రూ.72 వేల కోట్లు ఇరిగేషన్‌కు కేటాయించామన్నారు. గత ఐదేళ్ల పాలనలో 12 లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే ఇరిగేషన్‌కు 38 వేల కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో పోలవరం 20 ఏళ్లు వెనక్కి పోయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్‌కు విడుదల చేసిన నిధులను గత ప్రభుత్వంలో డైవర్ట్ చేశారన్నారు. గత ఐదు నెలల్లోనే వారానికి రెండు సార్లు రివ్యూ పెట్టుకుంటూ ఇరిగేషన్ ప్రాజెక్టులను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు. నదుల అనుసంధానం చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి పోలవరం జీవనాడి

### పోలవరం పూర్తయితే కరవుకు మంగళం
### అమరావతి, పోలవరం ప్రాజెక్టులు రెండు కళ్లు
### ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కాకూడదనే నిర్మాణ బాధ్యతలు
### పోలవరం ఆలస్యం అవుతుందనే పట్టిసీమ ద్వారా నీళ్లు
### 2027లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం
### సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు
### ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి రహదారుల నిర్వహణ
### ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



పోలవరం.. రాష్ట్రానికి జీవనాడి.. వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే కరవుకు చెక్ పెట్టినట్లే అని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై లఘు చర్చలో భాగంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను రెండు కళ్లుగా భావించినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కాకూడదనే నిర్మాణ బాధ్యతలు తీసుకున్నామన్నారు. పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతుందని.. పట్టిసీమ ద్వారా రైతులకు నీళ్లు ఇచ్చామని తెలిపారు. నీటి సంరక్షణకు చర్యలు తీసుకుందామని.. సాగునీటి సంరక్షణపై సభ్యులంతా అవగాహన పెంచుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. "పట్టిసీమను ఏడాదిలో పూర్తి చేసి రాయలసీమకు నీళ్లు ఇచ్చాం. ఒకే రోజులో 32 వేల క్యూబిక్ మీటర్లకు పైగా కాంక్రీట్ పనులు చేశాం. గతంలో 414 రోజుల్లోనే పోలవరం డయాఫ్రమ్ వాల్ పూర్తి చేశాం. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రికి డయాఫ్రమ్ వాల్ అంటే ఏంటో తెలియదు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం మేర పూర్తి చేశాం. 28 సార్లు ప్రత్యక్షంగా ప్రజెక్టును సందర్శించాను. 80 సార్లకుపైగా ప్రాజెక్టుపై వర్చువల్‌గా సమీక్షించాను. తెదేపా ప్రభుత్వం కొనసాగి ఉంటే ఇప్పటికే పోలవరం పూర్తయ్యేది.మాపై కక్షతో పోలవరం ప్రాజెక్టు ఆపేస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. మురి?త్వం, చేతకానితనం వల్ల గత ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ఆపేసింది. 2014-19 మధ్య మేం కష్టపడితే.. వైకాపా ప్రభుత్వం వచ్చి నాశనం చేసింది. తొందరపాటు తగదని కేంద్ర సంస్థ చెప్పినా.. గత ప్రభుత్వం వినలేదు. సరిగా పర్యవేక్షించకపోవడంతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఒక వ్యక్తి దుర్మార్గపు ఆలోచనలు రాష్ట్రానికి శాపంగా మారాయి. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రానికి రూ. వేల కోట్లు నష్టం వాటిల్లింది. కేవలం 3.08 శాతం పనులు మాత్రమే చేసింది. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రికి టీఎంసీకి, క్యూసెక్కులకు తేడా తెలియదు. పోలవరం గురించి అడిగితే పర్సెంటా. అర పర్సెంటా అని అవహేళన చేశారు. రాయలసీమలో ఎక్కడ చూసినా తెదేపా ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఉన్నాయి. పోలవరం ఎత్తు కచ్చితంగా 45.72 మీటర్లు ఉంటుంది. 2014-19 మధ్య ప్రాజెక్టుపై రూ.16,493 కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వం కేవలం రూ.4,099 కోట్లు ఖర్చు చేసింది. ప్రాజెక్టుకు రెండేళ్లలో రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. జనవరి నుంచి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ప్రారంభం కానుంది. 2026 మార్చిలోపు డయాఫ్రమ్ వాల్ పూర్తవుతుంది. 2027లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రహదారుల నిర్వహణపై వినూత్నంగా ఆలోచించానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి రహదారుల నిర్వహణ అప్పగించే యోచన చేస్తున్నట్టు చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. ''ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారులపై లక్షలాది గుంతలు ఏర్పడ్డాయి. రోడ్ల మరమ్మతులకు రూ.850 కోట్లు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి. జనవరిలో పండుగల సందర్భంగా రాష్ట్రానికి ఎవరైనా వస్తే మెరుగైన రహదారులు కనిపించాలనే ఉద్దేశంతో.. దృఢ సంకల్పంతో ముందుకుపోతున్నాం.

# ఏపీ అసెంబ్లీలో అడుగుపెట్టిన డాక్టర్ వైఎస్ సునీత

### వైఎస్ వివేకా హత్య కేసుపై చర్చ



అమరావతి, నవంబర్ 19 : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె, డాక్టర్ వైఎస్ సునీత రెడ్డి మంగళవారం ఏపీ అసెంబ్లీ వెళ్లారు. హోంమంత్రి వంగలపూడి అనితతో సునీత భేటీ అయ్యారు. వైఎస్ వివేకా హత్య కేసుపై చర్చించారు. అలాగే సీఎంవో అధికారులతోనూ ఆమె భేటీ అయ్యారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయానికి వచ్చిన సునీత.. సీఎంవో అధికాకారుతో సమావేశమై.. తన తండ్రి హత్య కేసులో పురోగతిపై చర్చించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి.. జైలు అధికారులకు రాసిన లేఖపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. అదే విధంగా సుప్రీం కోర్టులో వైఎస్ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దుకు సంబంధించి కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అఫిడవిట్ వేయడంతో పాటు.. ఈ కేసు దర్యాప్తులో పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ముందుగా హోంమంత్రి అనితతో మాట్లాడిన సునీత.. ఆపై సీఎంవో కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు. తన తండ్రి హత్య కేసులో పురోగతికి సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# రోజుకో చావుతో తెల్లవారుతోంది..

### రాజ్యహింసతో రాష్ట్రం తల్లడిల్లుతుంది
### ఎక్స్ వేదికగా కేటీఆర్ మండిపాటు



అమరావతి, నవంబర్ 19 : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలన కారణంగా ఆర్థికంగా చితికిపోయి రైతులు, ఆటోడ్రైవర్లతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిత్యం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా కవితాత్మంగా, తీవ్రంగా స్పందించారు. రోజుకో చావుతో తెలంగాణ తెల్లారుతోందని, కాంగ్రెసోడి కుట్రలకు బలైపోతున్నదని మండిపడ్డారు. రాజ్యహింసతో రాష్ట్రం నిత్యం తల్లడిల్లుతోందని, గాయాలతో గోడుగోడునా విలపిస్తోందని విమర్శించారు. రైతు రారాజుగా బ్రతికిన తెలంగాణలో అన్నదాతల ఆత్మహత్యలు నిత్యకృత్యమాయెనని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధికి చిరునామాగా మారిన రాష్ట్రంలో జీవనోపాధి కరువై బడుగులు బలిపీఠం ఎక్కవట్టెనని ఆయన వాపోయారు. ఇది ఎవడు చేసిన పాపమని, ముమ్మాటికీ మార్పు తీసుకొచ్చిన శాపమేనని పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 20-11-2024

## హద్దులు దాటుతున్న రాజకీయాలు !

రాజకీయమంటే అర్థం మారిపోయింది. అధికారం కోసం నానాగడ్డి తినేందుకు నేతలు వెనకాడడంలేదు. కేవలం విమర్శలే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నారు. పరస్పర విమర్శల్లో పడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అటు అధికార పార్టీ..ఇటు విపక్ష పార్టీలు పక్కన పెడుతున్నాయి.ఎంత తీవ్రంగా తిట్టి పోసుకుంటే అంత గట్టిగా రాజకీయాలు చేస్తున్నామని భావిస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు భ్రష్టు పట్టిపోతున్నాయి. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా అవి హద్దులు దాటడమే వికృత పరిణామానికి పరాకాష్టగా చూడాలి. భాషను ఎలా వాడుకోవాలో తెలియడం లేదు. ఎత్తులు పై ఎత్తులు వేయడం అవసరమే కానీ అలవికాని భాషలో విమర్శలతో దాడులు చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. ఎదుటి వారి ఆస్తులపైనా, కుటంబంపైనా దాడులు చేసే స్థితికి నేతలు రావడం సరికాదు. ఎదుటివారు ఎంతగా రెచ్చగొట్టేలా చేసినా..అంతకు పదింతలుగా అలాంటి పంథానే ఎన్నుకోవాలి. కానీ దాడులతో కట్టడి చేయాలనుకుంటే సరికాదు. నేతలు హుందాతనం కోల్పోతున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినా అవి కూడా హద్దులు దాటుతున్నాయి. వాడరాని భాష వాడుతున్నారు. రాయరాని భాషలో మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో గతంలో దాడులు, ప్రతిదాడులు ఎప్పుడూ ఉండేవి కావు. అడపాదడపా క్షేత్రస్థాయిలో స్వల్ప ఘటనలు మాత్రమే చోటు చేసుకునేవి. కాని ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. అధికార పార్టీ, విపక్ష పార్టీ అన్న తేడా లేకుండా దాడులకు, ప్రతిదాడులకు తెగబడు తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకూ ఓ హద్దు ఉండాలన్న ఇంగితాన్ని మరచి నేతలు ప్రవర్తిస్తున్నారు. తాజాగా మూసీ సుందరీకరణ, లగచర్ల, ఎపిలో రాజధాని, పోలవరం, విశాఖలో జగన్ అక్రమంగా నిర్మాణాలు వంటి విషయాల్లో నడిచిన డైలాగ్ వార్ కాస్తా దాడులకు దారితీస్తోంది. ఇది ముమ్మాటికీ అవాంఛనీయం. ఇలాంటి ఘటనలు జరగరాదు. అలాంటి పరిస్థితులకు రాజకీయ నాయకులు కారణం కారాదు. తెలంగాణలో ఏక్‌నాథ్ షిండే మాడల్ రాజకీయాలు చేస్తున్నారని బీజేపీపై విమర్శలు వస్తున్నాయి. బిఆర్ఎస్ రేవంత్ లక్ష్యంగా ఆయన పదవి ఊడిపోతుందని అంటున్నారు. లగచర్ల విషయంలో సామాన్యులకు నష్టం జరిగితే అడ్డుకోవాల్సిందే. విమర్శలను ప్రజలు ఆలోచించే విధంగా చేయాలి. నిజాలు ఉంటేనే మాట్లాడాలి.ఎలాంటి సంస్కార హీనత సరికాదు. ఎపిలోనూ ఇటీవల వైసిపి నేతల తీరు దారుణంగా ఉంది. ఐదేళ్లపాటు దాడులకు తెబడ్డారు. అక్రమంగా కేసులు బనాయించారు. నాయకులు యాత్రలు చేస్తుంటే అడ్డుకున్నారు. ఎక్కడ కాలు బయటపెట్టినా పోలీసులు నో చెప్పారు. సభలూసమావేశాలు నిర్వహించుకోకుండా చేసారు. కేసులు పెట్టి వేధించారు. విపక్షాలను అడ్డుకోవడం కోసం అనేక దుర్మార్గాల కు పాల్పడ్డారు. ఇప్పుడు ఎపిలో శాంతిభద్రతలు లేవంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసంబ్లీకి వస్తామని అంటున్నారు. ఇంతకన్నా దారుణం ఉండదు. ఐదేళ్ల పాటు సిఎంగా చేసిన జగన్ నిబంధనలు తెలయకుండా,తన వైఫల్యాలను గుర్తించకుండా వ్యవహరిస్తున్నారు. గతంలో మల్లన్న సాగర్ విషయంలో నిరంకుశంగా వ్యవహరించి, రైతులపై కేసులు పెట్టిన బిఆర్ఎస్ ఇప్పుడు లగచర్ల విషయంలో నానాగడ్డీ కరుస్తోంది. ఫార్మాసిటీ పేరుతో బలవంతంగా భూములు లాక్కున్న కెటిఆర్ ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు. అయితే ఎప్పుడైనా, ఎక్కడైనా భూసేకరణ మాత్రం బలవంతంగా సాగరాదు. సామాన్య ప్రజలకు నష్టం జరిగకుండా అడ్డుకోవాల్సిందే. సమస్యలను పెద్దవి చేసిచూపుతూ ..మొత్తంగా రాజకీయాల్లో హింసను జొప్పిస్తున్నారు. ఎవరిది పైచేయి అనేకన్నా అనేక సందర్భాల్లో అధికార పార్టీకి పోలీసులు వత్తాసుగా మారారు. దాడులకు తెగబడుతున్నా చూసీచూడనట్లుగా మిన్నికుంటున్నారు. మొత్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు శృతి తప్పుతున్నాయి. హద్దులు మీరుతున్నాయి. దాడులకు నేతలు తెగబడుతున్నారు. ఇది ఫ్యాక్షన్ తరహా రాజకీయం తప్ప మరోటి కాదు. వాంఛనీయం అస్సలు కాదు. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పాలి. లేకుంటే ప్రజలు అయినా ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇక లగచర్ల విషయంలో ప్రభుత్వం పునరా లోచన చేయాలి. బలవంతపు భూసేకరణమాత్రంసరికాదు. తెలంగాణలో అనాగరిక రాజ్యం నడుస్తున్నదని, నియంతృత్వ పాలన కొనసాగుతున్నదని, ఏహోదా లేని సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి డిఫాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నట్లు బిఆర్ఎస్ ఆరోపిస్తున్నది. తెలంగాణలో అరాచక పాలనపై ప్రధాని మోదీ సహా రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు మొత్తంగా బీజేపీ ఎందుకు స్పందించటం లేదని కేటీఆర్ నిలదీస్తున్నారు. గతంలో బిఆర్ఎస్ సర్కార్ ఉన్నప్పుడు కూడా ఇలాంటి డిమాండ్‌లే వచ్చాయి. మరి ఆనాటి పాలనపైనా విచారణకు ఆదేశిస్తే మంచిదే. అమాయక పేదల పక్షాన బీజేపీ,బిఆర్ఎస్ నేతలు ఎందుకు సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నారన్నే ముఖ్యం. గిరిజనులపై పోలీసులే లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బిఆర్ఎస్ చేస్తున్న విమర్శల్లో నిజాలను వెలికి తీయాలి. ఇప్పటికైనా కేంద్రానికి మనసుంటే ఈ ఘటనపై వెంటనే విచారణ చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సరార్ చేసిన అఘాయిత్యాలపై బాధితులు మానవ హకుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్‌ను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్ల ద్వారా న్యాయం జరుగుతుందని బాధితులకు, తమకు విశ్వాసం ఉన్నదని కేటీఆర్ చెప్పారు. దాష్టీకానికి పాల్పడిన పోలీసులకు నోటీసులు ఇస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. 'లగచర్ల ఘటనను దేశ ప్రజాస్వామ్యం దృష్టికి తెస్తం.. రాజ్యసభలో మా ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో వివరించి తెలంగాణలో రేవంత్ బండారాన్ని ఎండగడుతం అని స్పష్టంచేశారు. అయితే సమస్యలను దృష్టికి తెచ్చే క్రమంలో ఎలాంటి అలజడులు, పరస్పర నిందా రోపణలు సరికాదు. రాజకీయాల్లో మంచి వాతావరణం కోసం అందరూ కృషి చేయాలి.

# ఎమ్మిగనూరు పట్టణంలో సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం.




## అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్.

విభారే న్యూస్ నవంబర్ 19 కర్నూలు జిల్లా ప్రతినిధి.. సైబర్ నేరాల పట్ల ప్రజలు,విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి.మొబైల్ కు వచ్చే తెలియని లింక్ లు క్లిక్ చేయవద్దు.ఏ బ్యాంకు వాళ్లు ఒటీపిలు అడగరు. డిజిటల్ అరెస్టులు ఏమి లేవు ,సైబర్ నేరాగాళ్ళు చేసే మోసాలు నమ్మకండి. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే సంఘటన జరిగిన వెంటనే 1930 నెంబర్ కి డయల్ చేసి సమాచారం అందించండి. ఎమ్మిగనూరు పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో " సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం " నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు ముఖ్య అతిథి గా హాజరై,అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీ ఎమ్మినూరు పట్టణంలోని శాంతి సర్కిల్ నుండి సోమప్ప సర్కిల్ వరకు సాగింది.ఈ ర్యాలీ లో జిల్లా ఎస్పీ తో పాటు కాలినడకన న్యాయవాదులు,ఆశ వర్కర్లు,సచివాలయ మహిళా పోలీసులు, ఐసిడిఎస్, పట్టణంలోని కళాశాలల,పాఠశాలల విద్యార్థులు,కళాకారులు పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.ఓటిపిలు షేర్ చేయొద్దు అంటూ ప్లకార్డులతో,బ్యానర్లతో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడారు.చాలామంది ప్రజలు సైబర్ నేరాల బారిన పడుతున్నారన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకూడదనీ,జాగ్రత్తలు తీసుకోవాలని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.సోమవారం,ఆదివారం ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 3 కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్ల బారిన పడి ప్రజలు కోల్పోయారన్నారు. మన జిల్లాలో ఇప్పటివరకి 11 కోట్ల వరకు సైబర్ నేరగాళ్ల బారినపడి కోల్పోయారన్నారు.ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.1930 కి వెంటనే సమాచారం అందిస్తేబాధితులు నష్టపోయిన మొత్తాన్ని సైబర్ నేరగాళ్ల ఖాతాలకు వెళ్లకుండా కొంత భాగం వరకు బ్యాంక్ ఖాతాలో ఫ్రీజ్ చేయించి, నష్ట శాతాన్ని రికవరీ చేయవచ్చన్నారు.ఏ బ్యాంకు వాళ్లు ఓటీపీలు అడగరు, ఆన్లైన్ మీ షోలో లక్కీ డ్రా తగిలిందని, ఆ డబ్బులు మీకు ఇవ్వాలంటే ఒక లక్ష ట్యాక్స్ పే చెయ్యాలని, హనీ ట్రాప్,ఇన్ స్టాగ్రామ్ ఫేస్బుక్,ట్విట్టర్ల లో వచ్చే ఎలాంటి అనుమానిత లింకులను క్లిక్ చేయవద్దని,డెబిట్ కార్డు బ్లాకు అయిందని వచ్చే కాల్స్ నమ్మవద్దని,డ్రగ్స్ , వెపన్స్,గంజాయి కొరియర్ వచ్చిందని,డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, అలాంటి డిజిటల్ అరెస్టులు ఏమీ లేవని, ఎవరైనా తప్పు చేస్తే నేరుగా వచ్చి అరెస్టు చేస్తారని,డిజిటల్ అరెస్టులు అనేవి ఏమీ లేవని నమ్మ వద్దన్నారు.రోజూ రోజూ కూ సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. కుటుంబాలకు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. ట్రేడింగ్ యాప్, చైల్డ్ ఫోర్నో గ్రఫీ,లాటరీల పేరుతో మోసాలు,విడియోకాల్స్ చేసి,స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్, తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మన్నారు.ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజానికి ప్రతినిత్యం ఏదో ఒకచోట ఆర్థిక, మానసిక సవాళ్లను విసురుతూ మనుగడుకు అడ్డుపడుతున్న సైబర్ రాక్షసి ని మనమందరం తరిమికొడదాం అని ఈ విషయాలను ఇతరులతో పంచుకొని సైబర్ నేరాలకు స్థానం ఇవ్వకుండా చేయాలని విద్యార్థులు, యువకులు,ప్రజలతో జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు.ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే సంఘటన జరిగిన వెంటనే బాధితులు 1930 నెంబర్ కి డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో లిలిలి.ఇ-ఎవతీఇ-తీతిఎవ.ణనీల.తిని ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్ర బాబు,సిఐలు ప్రసాద్,అబ్దుల్ గౌస్, సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ సిఐలు విక్రమ సింహ, శ్రీనివాసులు,రామానీ జులు,గంగాధర్ రావు, సైబర్ ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వే అర్జీలను డిసెంబర్ 31 లోపు పరిష్కరించాలి



## గొర్రెల యూనిట్లను లబ్దిదారులతో ఏర్పాటు చేయించే విధంగా చర్యలు చేపట్టండి

## ఈ క్రాప్ బుకింగ్ ఫిబ్రవరి 15 వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి

## ఈ ఏడాది 10 వ తరగతి పరీక్షలో ఏ ఒక విద్యార్థి కూడా ఫెయిల్ అవ్వకూడదు

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, నవంబర్ 19: రీ సర్వే అర్జీలను డిసెంబర్ 31 లోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు..మంగళవారం ఆదోని పట్టణం లోని విమల రీజెన్సీ లో ఆదోని డివిజన్ రెవెన్యూ ఆఫీసర్స్, ఇతర శాఖలకు సంబంధించిన డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు..రెవెన్యూ, పి జి ఆర్ ఆర్ఎస్ వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇంజనీరింగ్, వైద్య, ఆరోగ్యం, విద్య తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో లోతుగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కి సంబంధించి గ్రామ సభలు అన్నీ పూర్తి అయ్యాయన్నారు. ఆదోని డివిజన్ లో 7 వేల 482 వరకు పిటిషన్ లు వచ్చాయన్నారు. వీటిని ఎస్ఓపి ప్రకారం డిసెంబర్ 31 లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..తహసీల్దార్లు గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించుకొని ఒక రోజు ముందు నోటీసు లు ఇచ్చి, గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. వచ్చిన అర్జీలలో మ్యుటేషన్ కేసులు ఉంటే దగ్గర ఉండి వారితో దరఖాస్తు పెట్టించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు..వివిధ అంశాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.. చాలా రోజుల నుంచి తిరిగినా పరిష్కారం కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అర్జీలు వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు... నెలకు సగటున ఒక్కొక్క తహసిల్దార్ కు 15 పిటిషన్లు రావొచ్చన్నారు..వీటిలో 5,6 క్లిష్టమైన సబ్జెక్టులకు సంబంధించిన అర్జీలు ఉంటాయని, కిందిస్థాయి సిబ్బంది మీద ఆధారపడకుండా తహసిల్దార్ లు స్వయంగా ఫీల్డ్ కి వెళ్లి, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటే ప్రజల్లో విశ్వాసం కలుగుతుందని కలెక్టర్ తహసిల్దార్లకు సూచించారు. ఆఫీస్ లో కూర్చుని ఎండార్స్మెంట్లు ఇస్తే నాణ్యత ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు.. డివిజన్ లో రీ ఓపెన్ కేసులు 9, సిఎంఓ గ్రీవెన్స్ లు 4 పెండింగ్ లో ఉన్నాయని, ఫీల్డ్ కి వెళ్లి వెరిఫై చేసి ఈ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలన్నారు..మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న రెవెన్యూ అంశాలపై తహసిల్దార్ ల నుండి నివేదికలు తెప్పించుకోవాలని కలెక్టర్ డి ఆర్ ఓ ను ఆదేశించారు.. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులకు సంబంధించి క్యాస్ట్ వెరిఫికేషన్ రిపోర్ట్ అడుగుతున్న సందర్భంలో వారంలోపు వెరిఫై చేసి రిపోర్టును పంపాలని కలెక్టర్ సూచించారు..నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ పథకం కింద మండలానికి 10 లక్షల రూపాయల విలువ కలిగిన 2 గొర్రెల యూనిట్లను లబ్దిదారులతో ఏర్పాటు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. ఈ పథకం మంచి పథకం అని, 50 శాతం సబ్సిడీతో పాటు 40% రుణం తీసుకోవచ్చని, 10% మాత్రమే లబ్ధిదారు చెల్లించాల్సి ఉంటుందని,ఈ విషయాన్ని లబ్ధిదారులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు.వ్యవసాయానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న ఈ క్రాప్ బుకింగ్ ఫిబ్రవరి 15 వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు.. ఆదోని డివిజన్ లో సి సి ఆర్ సి కార్డులు ఇవ్వడంలో కూడా 81.51 శాతం మాత్రమే సాధించారని 100 శాతం పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు..పెద్ద కడుబూరు, నందవరం, గోనెగండ్ల మండలాలు 70 శాతం పురోగతి సాధించారని, గోనె గండ్ల మండలం ప్రతి అంశంలోను వెనుకబడి ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. పెద్ద కడుబూరు మండలం అతి తక్కువ పురోగతి సాధించినందున మండల వ్యవసాయ శాఖ అధికారికి షో కాజ్ నోటీసు ఇవ్వాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు.. సి సి ఆర్ సి కార్డులు ఇప్పించే విషయంలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు.. సీసీఆర్సీ కార్డులు ఇప్పించడమే కాకుండా బ్యాంక్ లతో మాట్లాడి లోన్ లు ఇప్పించే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారులను, తహసీల్దార్ లను ఆదేశించారు.. హార్టికల్చర్ ప్లాంటేషన్ కు సంబంధించి ఫీల్డ్ లెవెల్ లో వెరిఫై చేసి సర్టిఫై చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. ఉపాధి హామీ, మెటీరియల్ కంపోనెంట్ కి సంబంధించి శాంక్షన్ చేసిన పనులను వెరిఫై చేసేందుకు ఎంపిడిఓ లు వారం రోజులలో 4 రోజులు ఫీల్డ్ లో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకోవాలన్నారు.. ఆదోని డివిజన్ లో ఆయిల్ పామ్ లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా సమావేశాలను నిర్వహించుకుని పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ కి సూచించారు.. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కి సంబంధించి డ్రిప్ కొరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయడంలో పెద్ద కడుబూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆర్ అండ్ బి కి సంబంధించి మొదటి ప్రాధాన్యతగా పెద్ద పెద్ద గోతులు, యాక్సిడెంట్ లు ఎక్కువ అవుతున్న ప్రదేశాల్లో ముందుగా గుంతలను పూడ్చి వేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.. కోడుమూరు నుంచి దేవనకొండ వరకు కొంత పూడ్చారని, బిల్లే కళ్ళు వద్ద పెద్ద గుంత ఉందని, పూడ్చివేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు..పంచాయతీ రాజ్ సీసీ రోడ్ల పనులకు సంబంధించి ఆదోని డివిజన్ లో 266 పనులను శాంక్షన్ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 256 గ్రౌండ్ అయ్యాయని, 44 పనులు పూర్తి అయ్యాయని, ఆదోని మండలంలో పనులు నిదానంగా జరుగుతున్నాయని పనులలో పురోగతి తీసుకొని రావాలనిక లెక్టర్ ఆదేశించారు... రోడ్ల పనులను డిసెంబర్ 31 వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఎస్ ఈని ఆదేశించారు.. చెత్త సంపద తయారీ కేంద్రాలు ఆదోని డివిజన్ లో 203 కి గాను 153 పూర్తి చేశారని, ఇంకా పూర్తి చేయకుండా పెండింగ్ లో ఉండడం ఏంటని కలెక్టర్ ఎంపిడిఓ లను ప్రశ్నించారు.. అత్యధికంగా ఆదోని మండలంలో 17, కౌతాళం మండలంలో 14, పెద్ద కడుబూరు లో 9 పెండింగ్ లో ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. భూ సమస్యలు ఏమైనా ఉంటే జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలన్నారు... పిఆర్ వన్ యాప్ లో ట్యాంకుల క్లోరినేషన్ చేసే ప్రక్రియలో కౌతాళం మండలంలో 27 ట్యాంక్ లు ఉంటే కేవలం 1 ట్యాంక్ క్లోరినేట్ చేయడం ఏంటని, మంత్రాలయం లో 15 ట్యాంక్ లు ఉంటే 11 ట్యాంక్ లు క్లోరినేట్ చేయకపోవడం ఏంటని కలెక్టర్ ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ లను ప్రశ్నించారు.. ప్రతిరోజు ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు.. ఉపాధి హామీ పనులకు సంబంధించి పనులు కల్పించడంలో ఆదోని, పెద్ద కడుబూరు, కోసిగి, నందవరం మండలాలు వెనుకబడి ఉన్నాయని పనులు కల్పించడంలో పురోగతి సాధించాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. మార్చి మాసం నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక రూపొందించుకొని లక్ష్యాల్ని సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు.. గోకులం పనులలో హోళగుంద, కోసిగి, కౌతాళం, నందవరం మండలాలు ఇంకా పనులు మొదలు పెట్టలేదని త్వరితగతిన పనులు మొదలు పెట్టి పురోగతి సాధించాలన్నారు..ఇక్కడ నిర్దేశించిన లక్ష్యాలను సాధించినట్లైతే జిల్లా స్థాయిలో ప్రగతి సాధించవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు.. సంక్షేమ వసతి గృహాల్లో బెడ్ షీట్ లను పంపిణీ చేశారా? లేదా? అని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. విద్య శాఖకి సంబంధించి ఈ ఏడాది 10 వ తరగతి పరీక్షలో ఏ ఒక విద్యార్థి కూడా ఫెయిల్ అవ్వకూడదని కలెక్టర్ పేర్కొన్నారు..వెంటనే స్పెషల్ క్లాస్ లు నిర్వహించాలన్నారు... పాస్ కాలేని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏ సబ్జెక్టులో బలహీనంగా ఉంటే ఆ సబ్జెక్టులో పాస్ అయ్యే విధంగా వారిపై ఫోకస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీచర్లు లీవ్ అప్లై చేయకుండా అయిన వారికి సంబంధించి, ఏ సమస్య లేకుండా ఆబ్సెంట్ అయిన వాళ్ళ పై విచారించి రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు... అపార్ కార్డు జనరేషన్ లో ఆదోని డివిజన్ 67 శాతంలో ఉందని, పురోగతి సాధించాలన్నారు.. కొత్తగా ఆధార్ కార్డు కొరకు ఆధార్ సెంటర్ కి దరఖాస్తు చేసుకున్న వాటిని, ఆధార్ కార్డులో డేట్ ఆఫ్ బర్త్ లో తప్పులు ఉన్న వాటిని సరి చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వాటిని తహసీల్దార్లు మానిటర్ చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. యు డైస్ యాప్ లో ఆధార్ కార్డుతో మిస్ మ్యాచ్ అయిన వాటిని సరిచేయడంలో పేరెంట్స్ తో సర్టిఫై చేసుకొని యు డైస్ యాప్ లో సరి చేయాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లను ఆదేశించారు.

# సజ్జల వర్సెస్ విజయసాయిరెడ్డి

## రెండుగా వైసీపీ లీడర్ షిప్



విశాఖపట్టణం, నవంబర్ 19, వైసీపీ రెండు గ్రూపులుగా చీలిపోయినట్టు వార్తలు వస్తున్నాయి. వైసీపీ ఓడిపోవడానికి సజ్జల వ్యవహారశైలి కారణమంటూ ఆ పార్టీ నేతలు దుయ్యబట్టారు. కొందరైతే ఆ పార్టీకి రాం రాం చేప్పేశారు. మళ్లీ సజ్జలను రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నియమించారు జగన్. దీంతో నేతలు, కార్యకర్తలు ఆశ్చర్యపోయారు.దెబ్బ తిన్న ఫ్యాన్‌కి రిఫేర్ చేయడానికి మంచి మెకానిక్ వస్తారని నేతలు, కార్యకర్తలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. మళ్లీ పాత మెకానిక్‌కే ఇచ్చారన్న భావన నేతల్లో మొదలైంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సకల శాఖమంత్రిగా పేరు పొందారాయన.అధికారంలో ఉన్నప్పుడు పార్టీని నడపడం, ప్రభుత్వ నిర్వహణలో సజ్జల ఫెయిల్ అయ్యారని, అందువల్లే 11 సీట్లకు పరిమితమయ్యామని ఆ పార్టీ నేతలు ఓపెన్‌గా విమర్శలు గుప్పించారు. 2014-19 సమయంలో విజయసాయిరెడ్డి హార్డ్‌గా పని చేశారని, ఆయన వల్ల అధికారంలోకి వచ్చిందని కొందరు నేతల మాట.ఈసారి వీఎస్‌ఆర్‌కే కీలక పగ్గాలు అప్పగిస్తారని చాలామంది నేతలు భావించారు. ప్రస్తుతం జగన్ విశ్వాసానికే జగన్ పెద్ద పీట వేసినట్టు కనిపిస్తోంది. ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు ఆరుగురు కో- ఆర్డినేటర్లను నియమించింది వైసీపీ. వారంతా సజ్జల ఆధీనంలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.దీనిపై కొందరు సీనియర్లు ఆగ్రహంతో ఉన్నట్లు ఆ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీని నడిపించడం తేలికే.. పవర్ లేనప్పుడు పార్టీని అధికారంలోకి తీసుకురావడమన్నది ఆశామాషీ కాదని అంటున్నారు.కీలక విషయాల్లో సజ్జల ఏ విధంగా సక్సెస్ అవుతారనేది ఇప్పుడు అసలు విషయం. ఫ్యాన్ పార్టీకి కొత్త మెకానిక్ రావడంతో ఆ పార్టీ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది ఆసక్తికర అంశం. వైసీపీ ఏది చెయ్యాలన్నా కచ్చితంగా జగన్ తెలియాల్సిందే. ఆయనకు తెలీకుండా ఏ పని జరగదన్నది కొందరి మాట. రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

తమిళనాడు సెంటిమెంట్ పై ఆశలు

మరోసారి అధికారంలోకి వస్తామని జగన్ ధీమాతో ఉన్నారు.ఎట్టి పరిస్థితుల్లో కూటమి పాలనలో ఫెయిల్ అవుతుందని.. సంక్షేమ పథకాలు అనుకున్న స్థాయిలో అందించలేదని..అప్పుడు ప్రజా వ్యతిరేకత పెరిగి వైసిపి వైపు ప్రజలు వస్తారన్నది జగన్ ధీమా.అయితే ఈ ఎన్నికల్లో వైసీపీ దారుణంగా ఓడిపోయింది.175 సీట్లకు గాను 11 స్థానాలకే పరిమితం అయింది.కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఆ పార్టీకి దక్కలేదు.దీంతోపార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న నేతలు ఒక్కొక్కరు గుడ్ బై చెబుతున్నారు. కూ టమి పార్టీల్లో అవకాశం లేని వారు రాజకీయాలను విడిచి పెడుతున్నారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఫల్యాలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. వాటిని బయటపెట్టే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు గత ఐదు సంవత్సరాలుగా వైసిపి పాలనలో రెచ్చిపోయిన సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా భూ భూ ఆక్రమణలను బయటకు తీసి దాని వెనుక ఉన్న వైసీపీ నేతలపై కేసులు నమోదు చేసేందుకు ఉపక్రమిస్తోంది. ఈ తరుణంలో వైసీపీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ఆ పార్టీ శ్రేణులు బయటకు వచ్చే పరిస్థితి లేదు. కానీ జగన్ మాత్రం తన పని తాను చేసుకు పోతున్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తామని పార్టీ శ్రేణులకు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.అయితే రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటివరకు మూడు ఎన్నికలు జరిగాయి. నవ్యాంధ్రప్రదేశ్ కు తొలి సీఎంగా చంద్రబాబు వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగలిగింది. వైసిపి పోరాటం కనబరిచి.. అధికారానికి కొద్ది దూరంలో నిలిచిపోయింది. కానీ 2014 నుంచి 2019 మధ్య గట్టిగానే పోరాడింది. దాని ఫలితంగా 2019లో తిరుగులేని విజయంతో అధికారంలోకి వచ్చింది వైసిపి. కానీ ఈ ఎన్నికల్లో అంతే దారుణంగా ఓడిపోయింది. దీంతో తమిళనాడు సెంటిమెంటును ఏపీ ప్రజలు కూడా కొనసాగించినట్లు అయ్యింది. ప్రతి ఐదు సంవత్సరాలకు పార్టీని మార్చినట్లు అయ్యింది. దీంతోనే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైసీపీ అధికారంలోకి రావడం ఖాయం అన్న ధీమాతో జగన్ ఉన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ కు తొలి సీఎంగా చంద్రబాబు వ్యవహరించారు. తరువాత జగన్ సీఎం అయ్యారు. అయితే చంద్రబాబు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు జగన్. వన్ చాన్స్ అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కానీ గత ఐదేళ్ల వైసిపి పాలనలో కొన్ని రకాల నిర్ణయాలతో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారు జగన్. అయితే 2014 నుంచి 2019 మధ్య, అదే గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎదురైన అనుభవాలను.. పరిగణలోకి తీసుకుంటున్న చంద్రబాబు అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు మళ్ళీ జగన్ కు అవకాశం ఇవ్వరని భావిస్తున్నారు. గతం మాదిరిగా ప్రజలు వ్యవహరించరని.. విజ్ఞతతో ఓటు వేసి మళ్లీ కూటమికే ఛాన్స్ ఇస్తారని చంద్రబాబు ధీమాతో ఉన్నారు. అయితే ఒక విధంగా చెప్పాలంటే ఆ ఇరువురు నేతలు ఊహల పల్లకిలో ఉన్నారు. మరి ఎవరు నెగ్గుకు రాగలరో చూడాలి.

# పిల్లలు ఎంత మంది ఉన్నా.. పోటీ...

విజయవాడ, నవంబర్ 19, ఎందరు పిల్లలు ఉన్నా ఇక పోటీకి అర్హులే!స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఈసారి సంతాన అర్హత లేదు. ఎంతమంది పిల్లలు ఉన్నా పోటీకి అర్హులే. ఈ మేరకు కూటమి ప్రభుత్వం కీలక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. మండలి లో ఆమోదం పొందిన మరుక్షణం చట్టంగా మారనుంది.ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ అర్హతకు సంబంధించి వయసు నిబంధనను సడలించింది. ఈ మేరకు ఆ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. దానికి శాసనసభ ఆమోదించింది. మండలిలో ఈ బిల్లు ఆమోదం పొందితే ఇక చట్టం గా మారనుంది. అదే జరిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతమంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చు. దేశంలో జనాభా నియంత్రణకు అప్పటి ప్రభుత్వాలు చాలా రకాల నిర్ణయాలు తీసుకున్నాయి. 'ఒకరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ముగ్గురు వద్దు' అన్న నినాదాన్ని ప్రజల్లోకి బలంగా పంపించగలరు. అయితే ఏపీలో జనాభా పెరుగుదల నియంత్రణకు 1994లో కీలక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. నాటి టిడిపి ప్రభుత్వం.. జనాభా పెరుగుదల నియంత్రణ చర్యల్లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం ఉంటే అనర్హతగా నిర్ణయించింది. దీంతో అసెంబ్లీలో ఆ బిల్లు ఆమోదించడంతో చట్టంగా మారింది. అప్పట్లో ఈ నిర్ణయం సంచలనం గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలామంది అర్హత కోల్పోయారు. ఒక విధంగా చెప్పాలంటే గ్రామస్థాయి నాయకుడిగా ఎదగాలనుకున్నవారు కుటుంబ నియంత్రణ పాటించారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో తాజాగా టిడిపి ప్రభుత్వం ఆ నిబంధనను సడలిస్తూ.. అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టింది. ఆమోదించింది కూడా. మండలి లో ఆమోదం లభిస్తే అది చట్టంగా మారనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతమంది సంతానం ఉన్నా పోటీ చేసేందుకు ఇకనుంచి అర్హులే.రాష్ట్రంలో సంతానాభివృద్ధి కోసమే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో నడివయస్కులతో పాటు వృద్ధ జనాభా పెరుగుతోంది. దీనికి సంతానోత్పత్తి లేకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. పెద్ద కుటుంబాలు కాస్త చిన్న కుటుంబాలు అయ్యాయి. ఒక పిల్లాడితోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకుంటున్నారు. దీంతో పిల్లల ఉత్పత్తి పెరగడం లేదు. దాని ప్రభావం యువత పెరుగుదలపై కనిపిస్తోంది. ఎక్కువ మంది యువత నడివయస్కులవుతున్నారు. నడివయస్కులు వృద్ధులుగా మారుతున్నారు. అయితే సంతానోత్పత్తి లేకపోవడంతో.. నడివయస్కులు, వృద్ధ జనాభా పెరిగిన మాదిరిగా యువత రావడం లేదు. యువత లేకపోవడంతో అభివృద్ధి అనేది కనిపించడం లేదు. అందుకే ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.గతంలో జనాభా నియంత్రణ కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. కానీ ఇప్పుడు జనాభా కావాలని ప్రభుత్వాలే ప్రోత్సహిస్తుండడం విశేషం. అయితే గతంలో ఎన్టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సంతాన అర్హతను తెచ్చింది. ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ అర్హతను సడలిస్తూ బిల్లును ప్రవేశపెట్టింది. అయితే మండలిలో వైసీపీకి బలం ఉన్న నేపథ్యంలో ఈ బిల్లు ఎంతవరకు ముందుకు వెళ్తుందో చూడాలి.

# శాసనమండలికి బాలినేని



ఒంగోలు, నవంబర్ 19, ద మొన్న కాంగ్రెస్, నిన్న వైసీపీ, నేడు జనసేన పార్టీ కండువా కప్పుకున్న ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఖరారైందన్న వార్తలు హల్చల్ చేస్తున్నాయి. నేనెక్కడున్నా రాజా.. రాజానే అనే రీతిలో ఉంది ఆ నేత పాలిటిక్స్ తంత్రం. ఇంతలా చెప్పాక ఆ నేత ఎవరో చెప్పాల్సిన అవసరం లేదుగా.. ఆయనేనండి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిఒంగోలుకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయానా మాజీ సీఎం జగన్ కు సమీప బంధువు కూడా. ఏపీలో మారిన రాజకీయ పరిణామాల మధ్య బాలినేని ఇటీవల జనసేన పార్టీలో చేరారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన బాలినేనికి, ఆదిలో కొంత అవరోధాలు స్వాగతం పలికాయి. కారణం ఒంగోలుకు చెందిన టీడీపీ నేతలు, జనసేనలో బాలినేని చేరికకు అడ్డు చెప్పడమే. అయినా తన పని తాను చేసుకుపోయినట్లు బాలినేని పార్టీలో చేరే ఘట్టం కూడా పూర్తయింది. కాంగ్రెస్, వైసీపీ లలో ఉన్న సమయంలో బాలినేని, మంత్రి పదవులను కూడా దక్కించుకున్నారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బాలినేని, జనసేనలో చేరగా ఒంగోలు టీడీపీ నేతలకు మింగుడు పడలేదనే చెప్పవచ్చు. కారణం వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బాలినేని, తమను వేధించారన్నది స్థానిక టీడీపీ నాయకుల వాదన.ఇప్పుడు జనసేనలో చేరి సైలెంట్ గా, నియోజకవర్గానికి దూరమై హైదరాబాద్ లో ఉంటున్నారు బాలినేని. కానీ ఆయన ఏమీ ఆశించకుండా ఉండే రకం కాదన్నది పొలిటికల్ టాక్. అందుకే జనసేనలో చేరిన బాలినేనికి, పవన్ ఎమ్మెల్సీ గా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారట. ఆ హామీని త్వరలోనే నిలబెట్టుకొనేలా పవన్ చక్రం తిప్పుతున్నారట. త్వరలో ఎమ్మెల్యేల కోటా కింద భర్తీ చేసే ఎమ్మెల్సీ పదవులలో జనసేనకు ఒకటి, కూటమి కేటాయించనుంది. ఆ ఒక్క ఎమ్మెల్సీ పదవి బాలినేనికి ఖరారైనట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.అదే జరిగితే ప్రకాశం జిల్లాలో మళ్లీ బాలినేని తన హవా కొనసాగించే అవకాశం ఉంది. అయితే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, బాలినేని మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో వివాదాలు ఉండగా, బాలినేని ఎమ్మెల్సీ పదవిని స్వీకరిస్తే అక్కడ ఒక్క ఒరలో ఏ మేరకు రెండు కత్తులు ఇమడుతాయో వేచి చూడాలి. కాగా ఎమ్మెల్సీ పదవి దక్కిన వెంటనే పవన్ తో ఒంగోలు లో భారీ బహిరంగ సభను కూడా బాలినేని ఏర్పాటు చేసే అవకాశం ఉందని కూడా ప్రచారం ప్రకాశంలో జోరందుకుంది.ఏదిఏమైనా బాలినేనికి ఎమ్మెల్సీ పదవి దక్కితే మాత్రం, ప్రకాశంలో జనసేనకు మరింత బలం చేకూరి క్యాడర్ బలోపేతం అవుతుందని బాలినేని అభిమానులు తెలుపుతున్నారు. మరి ఇంతకు బాలినేని కి ఎమ్మెల్సీ పదవి దక్కుతుందా? లేదా అన్నది త్వరలోనే బహిర్గతమయ్యే రాజకీయ స్థితిగతులు ఉన్నట్లు పొలిటికల్ టాక్.

బాలినేని చేరికపై అనుమానాలు

బాలినేని జనసేనలో చేరిక వెనుక అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున అభ్యంతరాలు కూడా వచ్చాయి. ఆయన వైసీపీ కోసమే జనసేన లోకి వచ్చారన్న ప్రచారం కూడా ఉంది. కూటమిలో విభేదాలు పుట్టించేందుకు ఆయన జనసేనలోకి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఎటువంటి ఆర్భాటం లేకుండా ఆయన చేరిక పూర్తయింది. అయితే ఇప్పుడు ఆయన స్థానంలో వైసీపీకి కొత్త ఇన్చార్జి వచ్చారు.. చండూరు రవి అనే వ్యక్తిని నియమించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ ఉన్నారు. అన్నింటికీ మించి బలమైన క్యాడర్ తో బాలినేని శ్రీనివాస్ రెడ్డి సైతం జనసేన ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. ఇటువంటి తరుణంలో ముక్కు ముఖం తెలియని వ్యక్తిని వైసీపీ ఇన్చార్జిగా నియమించడం విశేషం. ఈ నియామకం వెనుక బాలినేని ప్రయోజనం దాగి ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.ఇప్పటికీ వైసీపీ ఇన్చార్జిగా బాలినేనినే భావిస్తోందట అధిష్టానం.బాలినేని బలపడితే పార్టీ బలపడుతుందని భావిస్తోందట. అందుకే బాలినేనికి ఇబ్బంది లేకుండా చుండూరు రవి అనే సామాన్య నేతను వైసీపీ ఇన్చార్జిగా నియమించినట్లు ప్రచారం సాగుతోంది. వాస్తవానికి ఒంగోలు వైసిపి క్యాడర్ అంతా బాలినేని వెంట ఉంది. అలాగని వారంతా జనసేన అభిమానులు కాదు. ఆ పార్టీకి పనిచేయరు. అందుకే ఇప్పుడు బాలినేని బలహీనం చేయకుండా ఉంచేందుకు జగన్ రవి అనే కొత్త వ్యక్తిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.

# నేడు ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం


ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబరు 20 న జరుపుకుంటారు. 1954 డిసెంబరు 14 న ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959 నవంబరు 20న ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. 1989 నవంబరు 20న బాలల హక్కుల పై కన్వెన్షన్ ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20 న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తనారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ స్వచ్ఛంధ సంస్థల అధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించబడుతాయి.బాలల కోసం 1946లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ యునిసెఫ్‌ను స్థాపించింది. మానవతా దృక్పథంతో ఏర్పాటు చేయబడ్డ ఈ సంస్థ బాలల హక్కులను పరిరక్షించడంలోనూ, వారి పురోభివృద్ధి, రక్షణ విషయంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. బాలల కోసం అహర్నిశలూ శ్రమిస్తూనే ఉంది. ప్రస్తుతం 155 దేశాకు విస్తరించిన ఈ సంస్థ 1965లో నోబెల్ శాంతి బహుమతిని పొందింది. బాలల సంక్షేమం, ఛైల్డ్ వేల్ఫేర్, విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహిస్తారు.

# శబరిమలకు విమానయాన సంస్థలు

తిరువనంతపురం, నవంబర్ 19, కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయం శబరిమల దివ్యక్షేత్రాన్ని ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు దర్శించుకుంటారు. ప్రధానంగా డిసెంబర్ ? జనవరి నెలల్లో జరుగుతున్న మండల మకరవిళక్కు పూజల సమయంలో భక్తుల సంఖ్య బాగా ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, వారి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు ప్రభుత్వం, విమానయాన సంస్థలు అదనపు విమాన సర్వీసులు ప్రకటించాయి. శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. ప్రత్యేకంగా సంక్రాంతి, మకరవీధి పూజలు సమయంలో భక్తుల తాకిడి ఒక పెద్ద సవాలుగా మారింది. దీంతో, ప్రభుత్వాలు, విమానయాన సంస్థలు భక్తుల రవాణాకి అదనపు విమాన సర్వీసులు అందించాలని నిర్ణయించాయి. ఈ అదనపు విమాన సర్వీసులు శబరిమల దర్శనానికి వచ్చే భక్తులకు ఒక గొప్ప పరిష్కారంగా మారాయి. భక్తులు, విమాన సేవల ద్వారా త్వరగా తమ లక్ష్యానికి చేరుకోగలుగుతున్నారని అభిప్రాయపడుతున్నారు. శబరిమలై భక్తుల సౌకర్యార్థం చెన్నై నుంచి కొచ్చికి రోజుకు ఎనిమిది విమానాలు నడుపుతున్నట్టు విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. చెన్నై నుంచి నడిచే ఎనిమిది విమానాలతో పాటు బెంగళూరు నుంచి చెన్నైకి వచ్చే మూడు విమానాలు కొచ్చి వరకు పొడిగించారు.జనవరి 25వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుంది. అలాగే ఎయిరిండియా ఎక్స్ప్రెస్, ఇండిగో, స్పైస్ జెట్ సంస్థలు చెన్నై నుంచి కొచ్చికి విమాన సేవలందిస్తాయి.మండల సీజన్ డిసెంబర్ 26 వరకు కొనసాగుతుంది. వచ్చేనెల 30 నుంచి మొదలయ్యే మకరవిళక్కు సీజన్ 2025 జనవరి 20 వరకు కొనసాగుతుంది. అప్పుడు కూడా మండల దీక్షలు తీసుకున్న అయ్యప్ప స్వాములు భారీగా తరలివస్తారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

# 2, 4 గంటల్లో తిరుమలేశుని దర్శనం... సాధ్యమేనా

తిరుమల, నవంబర్ 19,తిరుమలలో సర్వ దర్శనానికి వచ్చే భక్తులకు 2, 3 గంటల్లోనే శ్రీవారి దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఇది ఎలా సాధ్యమనే విషయాలు పరిశీలిస్తే.. కంకణం విధానం తిరిగి అమల్లోకి తీసుకొస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా, కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశుని దర్శనానికి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. వీరికి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ.10,500 ప్రత్యేక దర్శనం, ఆర్జిత సేవలు, స్లాట్ దర్శనం, సర్వ దర్శనం వంటి విధానాలు అమల్లో ఉన్నాయి. తిరుమలకు వచ్చే భక్తులు అత్యధికులు సామాన్య భక్తులే. వీరికి పెద్దపీట వేస్తామని టీటీడీ నూతన పాలక మండలి చెబుతోంది. అయితే, రద్దీ ఉన్న సమయాల్లో వైకుంఠం రెండో క్యూ కాంప్లెక్స్‌లోనే దాదాపు 30 గంటలు స్వామి వారి దర్శనం కోసం సామాన్య భక్తులు వేచి చూ?డాల్సి వస్తోందిస్లాట్ దర్శనం అంటే శ్రీనివాసం, విష్ణునివాసంలో ఆధార్ కార్డు ద్వారా భక్తులకు దర్శన సమయం కేటాయిస్తారు. దీంతో 2, 3 గంటల్లోనే దర్శనం పూర్తవుతుంది. అయితే, ఈ టికెట్లు పరిమితంగానే ఉంటాయి. అటు, అలిపిరి, శ్రీవారి మెట్ల నుంచి కాలి నడకన వచ్చే భక్తులకు గతంలో దివ్య దర్శనం పేరుతో కొన్ని టికెట్లు కేటాయించేవారు. ఇందులో భాగంగా 2, 3 గంటల్లోనే శ్రీవారి దర్శనం పూర్తయ్యేది. అయితే, గత ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది.2 దశాబ్దాల కిందట టీటీడీ ఈవోగా ఐవీ సుబ్బారావు ఉన్న సమయంలో 'కంకణం' విధానం ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ప్రతీ భక్తుడి చేతికి రిస్ట్ బాండ్ తరహాలో ఓ కంకణాన్ని ట్యాగ్ చేస్తారు. ఇది వాటర్ ప్రూఫ్ తరహాలో ఉంటుంది.దీన్ని తిరుపతిలోని అనే కేంద్రాలతో పాటు రేణిగుంట తదితర ప్రాంతాల్లో వేసేవారు. ఈ విధానంతో మనకు కేటాయించిన సమయానికి



వెళ్లి 2, 3 గంటల్లోనే స్వామి దర్శనం చేసుకుని రావొచ్చు. టీటీడీ ప్రస్తుత ఛైర్మన్ ఈ అంశాన్ని గతంలో ప్రస్తావించారు. దీన్నే తిరిగి అమలు చేసే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.30 ఏళ్ల క్రితం వరకూ సామాన్య భక్తుడు కూడా శ్రీవారి మూలవిరాట్‌ను అత్యంత సమీపంలో అంటే కులశేఖరపడి వరకూ వెళ్లి దర్శనం చేసుకోవచ్చు. ప్రస్తుతం వీఐపీలు, రూ.10,500 దర్శనాలకు మాత్రమే ఇక్కడి వరకూ అనుమతిస్తున్నారు.తర్వాతి కాలంలో లఘు దర్శనం ఏర్పాటు చేశారు. దీని ప్రకారం గరుడాళ్వార్ సన్నిధి నుంచి జయవిజయులను దాటి స్నపన మండపం వరకూ వెళ్లి దర్శించుకునేవారు. అనంతరం దీన్ని కూడా రద్దు చేసి గరుడాళ్వార్ సన్నిధి నుంచి దర్శనం కల్పిస్తున్నారు. దీనికి మహా లఘుదర్శనంగా పేరు పెట్టారు.అయితే, భక్తులు మాత్రం లఘుదర్శనం కల్పించాలని కోరుతున్నారు. ఇలా చేస్తే దేవదేవుని సన్నిధిలో ప్రవేశించామన్న ఆనందానుభూతి కలుగుతుందని చెబుతున్నారు. దీన్ని పాలక మండలి పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు.టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీవాణి ట్రస్టును రద్దు చేసి ప్రధాన ట్రస్ట్‌కే ఆ నిధులు తరలిస్తామని తెలిపారు. శ్రీవాణి పథకం మాత్రం కొనసాగుతుందని ఛైర్మన్ చెప్పారు. 'అన్యమతస్తులను వేరే చోటకు బదిలీ చేయాలని నిర్ణయం. శ్రీనివాస సేతును గరుడ వారధిగా పేరు పునరుద్ధరణ. తిరుమలలో రాజకీయాలు మాట్లాడితే కేసులు. నిత్యన్నదాన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరుస్తాం. లడ్డూలోని నెయ్యి నాణ్యతను మరింత పెంచాలని నిర్ణయం. టీటీడీ ఉద్యోగులకు 10 శాతం బోనస్ ఇవ్వాలని నిర్ణయం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయం. టూరిజం శాఖ ద్వారా ఇచ్చే టికెట్లను రద్దు చేయాలని నిర్ణయం.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన.




విభారే నందికొట్కూరు:నందికొట్కూరు పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ దీప గారి అధ్యక్షతన నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్, ఆర్ ఐ కోటయ్య చౌదరి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఈజ్ కమ్యూనిటీ కన్సర్ అనే నినాదంతో రోడ్డు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు పోలీస్ అధికారులచే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వలన జరిగే పరిణామాలపై అవగాహన కల్పించడంతోపాటు ,ట్రాఫిక్ నిబంధనలు మీరు పాటిస్తూ మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో పాఠశాల నుండి పటేల్ సెంటర్ వరకు స్పీడ్ థ్రిల్ బట్ ఇట్ కిల్స్, సేఫ్టీ ఫస్ట్ స్పీడ్ నెక్స్ట్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

## అయ్యప్ప స్వాములకు స్పెషల్ రైళ్లు

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19–శబరిమల స్పెషల్ ట్రైన్స్ నంద్యాల మీదుగా జిల్లా అయ్యప్ప దీక్ష స్వాముల కోసం కేంద్ర రైల్వే శాఖ నడుపుతుందని, నంద్యాల జిల్లా అయ్యప్ప స్వాములు ఉపయోగించుకోవాలని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ట్రైన్ నెంబర్ :07147/07148 మచిలీపట్నం – కొల్లం వయా నంద్యాల..23, 30 డిసెంబర్ రోజులలో నంద్యాలలో రాత్రి 8:45 కు చేరుకొని కొల్లం కి మరుసటి రోజు రాత్రి 9:30 కు చేరుకుంటుందని, అలాగే కొల్లం లో 25 డిసెంబర్, 01 జనవరి ఉదయాన్నే 2:30 గంటలకు బయలుదేరి నంద్యాలకు మరుసటి రోజు ఉదయం 2:30 కు చేరుంటుందని ఈ రైలు నంద్యాల అయ్యప్ప స్వామి భక్తులకు చాలా ప్రయోజనం అని ఎంపీ శబరి తెలిపారు. స్వామి మాల ధరించిన వారు ఈ రైలు సదుపాయాన్ని ఉపయోగించాలని ఆమె కోరారు.

## భక్తులతో కిటకిట లాడిన మహానంది క్షేత్రం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19–మంగళవారం మహానంది క్షేత్రం భక్తులతో కిటకిట లాడింది. మహానంది పుణ్యక్షేత్రంలో స్వయంభుగా వెలసిన శ్రీ మహానందీశ్వర స్వామి వారికి మంగళవారం నాడు ఆర్ద్రోత్సవ నక్షత్రం సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాంఘాట్, వేద మంత్రాలతో స్వామివారికి విశేష ద్రవ్యాలం, పంచామృతాలతో అభిషేకాలను స్వామివారికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారికి సమర్పించిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. భక్తులతో మహానంది క్షేత్రం కిటకిట లాడింది.



## భరతమాత ముద్దుబిడ్డ శ్రీమతి ఇందిరా గాంధీ



**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ**

విభారే న్యూస్ నవంబర్ 19 కర్నూల్ ప్రతినిధి భరతమాత ముద్దుబిడ్డ శ్రీమతి ఇందిరాగాంధీ గారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ పి మురళీకృష్ణ ఆమె సేవలను కొనియాడారు. శ్రీమతి ఇందిరా గాంధీ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిందని భారత ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కి కుమార్తెగా భారత తొలి మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ని భావితరాల కోసం నిస్వార్థ సేవలు అందించి వీర వనితగా అడుగడుగునా కష్టాలు ఎదురైనా వాటిని అధిగమించి ప్రజా సేవకు తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి శ్రీమతి ఇందిరాగాంధీ ని, మాతృదేశ సేవలో తన ప్రతి రక్తపుబొట్టు తరిస్తుందని చెప్పి దేశం కోసం ప్రాణాలను త్యాగం చేశారని ఆమె ప్రధానిగా ఉన్నప్పుడు బ్యాంకుల జాతీయీకరణతో రైతులు, చిన్న పరిశ్రమలు, పేదలకు ఎంతో మేలు కలిగించారని రాజ భరణాల రద్దు, ఇరవై సూత్రాల ఆర్థిక ప్రణాళిక, సర్కారియా కమిషన్ ఏర్పాటు, అంటరానితనం నిర్మూలన మొదలగు వాటితో ఎన్నో ప్రయోజనాలు పేదప్రజలకు లభించాయని అలాగే శ్రీమతి ఇందిరా గాంధీ పుట్టినరోజు బంగ్లాదేశ్ విమోచన దినంగా జరుపు కుంటున్నామని 1971కి పూర్వం పాకిస్తాన్ సైనికులు పాకిస్థాన్ ప్రజలు, బెంగాలి పౌరులు మహిళలు, విద్యార్థుల పై హత్యలు, అత్యాచారాలు చేసి హింసించేవారని పాకిస్థానీయుల అకృత్యాలను భరించలేక బెంగాలీ శరణార్థులు మనదేశంలో తలదాచుకుంటే కోటి మందికి ఆశ్రయం కల్పించిన ఘనత శ్రీమతి ఇందిరాగాంధీ గారిదని 1971 సంవత్సరం సైనికచర్య ద్వారా అత్యంత నైపుణ్యంతో చాకచక్యంగా భారత వైమానిక బలగాలు పాక్ సైన్యాన్ని యుద్ధం లో మట్టికరిపించి బంగ్లాదేశీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కల్పించిన ఘనత శ్రీమతి ఇందిరాగాంధీ కే దక్కుతుందని. పరదేశంపై సైనిక చర్య అవసరమా అని ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు శ్రీమతి ఇందిరా గాంధీ సమాధానమిస్తూ మాఇంటి ఆడపడుచులే కాదు పక్కింటి ఆడపిల్లలకు అన్యాయం జరిగిన చూస్తూ ఊరుకోనని సమాధానమిచ్చిన వీరవనిత శ్రీమతి ఇందిరాగాంధీ గారని మురళీకృష్ణ ఆమె సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆమె 107 వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక రాజవిహార్ సెంటర్ నందలి శ్రీమతి ఇందిరాగాంధి గారి కాంస్య విగ్రహమునకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి అధ్యక్షుడు బి బతకన్న, కాంగ్రెస్ నాయకులు వెంకట రెడ్డి. పోతుల శేఖర్ యన్ సి బజారన్న ఎన్ చంద్రశేఖర్ షేక్ ఖాజా హుస్సేన్ ఎస్ ప్రమీల సాంబశివుడు అనంతరత్నం మాదిగ సయ్యద్ నవీద్ డబ్ల్యూ సత్యరాజు బివి సుబ్రహ్మణ్యం ఖాద్రి భాషా యజాస్ అహ్మద్, ఐ ఎన్ టి యు సి నాయకులు ఎన్ సుంకన్న, అని ఆనందం. జేమ్స్ అబ్దుల్ హై శేషన్న నడిపన్న జమ్మన్న లోకరమయ్య మొదలగువారు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణాల పూర్తికి సహకరించండి---



**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19–జాతీయ రహదారుల నిర్మాణాల పూర్తికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కోరారు. మంగళవారం పాములపాడు మండలంలోని 340 సి జాతీయ రహదారి (కర్నూలు నుండి దోర్నాల) నిర్మాణ పనులను జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, జాతీయ రహదారుల అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 340 సి నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణాలకు సంబంధించి రహదారుల విస్తరణలో భాగంగా కొన్ని ప్రదేశాల్లో జాతీయ నాయకుల విగ్రహాలు, ప్రార్థనాలయాలు, గృహాలు, స్ట్రక్చర్లు తదితర నిర్మాణాలకు సంబంధించిన క్లైయిమ్స్ ను కూడా భూమిరాశి పోర్టల్ లో అప్లోడ్ చేశామని వారం రోజుల్లో సంబంధిత నిర్మాణదారులకు నష్టపరిహారం చెల్లించిన వెంటనే సంబంధిత భూములను స్వాధీనం చేసుకొని ఎన్ హెచ్ అధికారులకు అప్పగించి రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు. జాతీయ రహదారుల నిర్మాణాల పూర్తికి క్లైయిమ్స్ దారులతోపాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ జాతీయ రహదారి పనులు పూర్తయితే కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు మంచి రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి, సంబంధిత మండల తాసిల్దార్లు కలెక్టర్ వెంట ఉన్నారు.

## 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ

విజయవాడ, నవంబర్ 19, ఏపీలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో రూ.314 కోట్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో రైతుల దగ్గర ధాన్యం కొని, నెలల తరబడి డబ్బులు చెల్లించలేదన్న విమర్శల నేపథ్యంలో... కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులపై దృష్టిపెట్టింది. వైసీపీ దిగిపోయే నాటికి 84,724 మంది రైతులకు రూ.1674.47 కోట్లు బకాయిలు కూటమి సర్కార్ తెలిపారు. ఆ బకాయిలను రైతులకు చంద్రబాబు ప్రభుత్వమే చెల్లించిందని మంత్రులు తెలిపారు.ప్రస్తుతం 48 గంటల లోపే ధాన్యం కొనుగోలు డబ్బుల్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని కూటమి నేతలు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.288 కోట్లను రైతులకు చెల్లించిందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపే రూ.279 కోట్లు జమ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతకు తోడుగా నిలిస్తుందని చెబుతున్నారు.రైతులు ధాన్యం విక్రయించుకొనే విధానాన్ని ఏపీ సర్కార్ సులభతరం చేస్తూ సంస్కరణలు తీసుకువచ్చింది. రైతులు తమ పంటను జిల్లాలో ఎక్కడైనా, ఏ రైస్ మిల్లుకైనా అమ్ముకొనే విధానాన్ని అమలుచేస్తుంది. అదే విధంగా వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయాలు చేసేందుకు సులభ విధానం అందుబాటులోకి తెచ్చింది. ఆరుగాలం రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యం విక్రయించుకొనేందుకు ఎలాంటి శ్రమ అవసరం లేకుండా....సులభమైన మార్గాన్ని అందుబాటులోకి తెచ్చింది. 73373 59375 నెంబర్ కు వాట్సాప్ లో ఊతి పెడితే చాలు...ధాన్యం కొనుగోలు సేవలు అందుబాటులోకి వస్తాయి. రైతులు ఏ కేంద్రంలో, ఏ రోజు, ఏ టైంలో, ఏ రకం ధాన్యం, ఎన్ని బస్తాలు అమ్మదలుచుకున్నారో వాట్సాప్ లో పౌరసరఫరాల శాఖ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ స్లాట్ బుక్ చేసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయాలకు స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలిపే వీడియోను పౌరసరఫరాల శాఖ సామాజిక మాధ్యమాల్లో పెట్టింది.ఏపీలోని పలు జిల్లాలో వరి కోతలు ప్రారంభంకావడంతో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీకేలు, సహకార సొసైటీలు, మార్కెట్‌యార్డుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం తేమ శాతం కొలిచే యంత్రాలు, గోనె సంచులను కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. ఒకవేళ రైతులు గోనె సంచులు ఏర్పాటు చేసుకుంటే ఒక్కో సంచికి రూ.3.39 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. అదేవిధంగా క్వింటాకు హమాలీ ఛార్జీల కింద రూ.17.17 ఇస్తున్నారు. దీంతో పాటు పొలాల్లోని కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం రవాణా ఛార్జీలు చెల్లించనుంది. ధాన్యం రవాణా వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ చేస్తున్నారు

## టీడీపీ నేత రంగబాబుపై దాడి కేసు

**వంశీ అనుచరుల అరెస్టు**

గన్నవరం,గన్నవరం టిడిపి నాయకుడు రంగబాబు పై దాడి కేసులో వైసీపీ నాయకులు అరెస్ట్ అయ్యారు. గతంలో పార్క్ ఎలైట్ హోటల్ వద్ద టిడిపి నాయకుడు పై కొంత మంది వ్యక్తులు దాడి చేసారు. దాడికి సంబంధించి సూత్రధారులు వైసిపి నాయకులగా పోలీసులు గుర్తించారు. మంగళవారం తెల్లవారుజాము నుండి వైసిపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, అనగాని రవి, భీమవరపు యేతంద్ర రామకృష్ణ(రాము),మేచినేని బాబు,సూరపనేని అనీల్ గోన్నూరి సీమయ్య, గుర్రం నానిలు వున్నారు.

## ఆస్తి కోసం గొడవ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19–మంగళవారం బనగానపల్లె లోచాకలి శ్రీరాములు(44) పై స్వయానా అన్న కొడుకే పట్టపగలు తలపైన మెడ భాగాన వేట కొడవలితో విచక్షణంగా నరికి పరారైనారని స్థానికులు చెబుతున్నారు . శ్రీరాములు పై వేట కొడవలి తో నరికి దాడి చేసి గోప్యంగా ఎవరికంట పడకుండా మెల్లగా తప్పించుకొని పరారైనట్లు తెలుస్తోంది .విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించిన సీఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై దుగ్గిరెడ్డి.రక్తపు మడుగులో పడి ఉన్న శ్రీరాములు ను 108 వాహనం లో బనగానపల్లె ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు. స్వయాన అన్నకొడుకే శ్రీరాములు ను పట్టపగలు వేట కొడవలితో నరికి హత్య చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్న పోలీసులు.గతం లో వీరికి ఆస్తివివాదంలో ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది.హత్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.

## సామాజిక అంశాలపై అవగాహన తప్పనిసరి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19– సామాజిక అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తూనికల కొలతల ఇన్స్పెక్టర్ అనిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్పీజీ హై స్కూల్ నందు కన్స్యూమర్ క్లబ్ వారు వినియోగదారుల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూనికల కొలతల ఇన్స్పెక్టర్ అనిత ఎస్ పి జి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు జీవ లత. వినియోగదారుల సంఘం అధ్యక్షుడు అమిర్ భాష. ఫోరం సభ్యుడు గుబ్బ రజనీకాంత్. పాల్గొన్నారు. తూనికల కొలతల ఇన్స్పెక్టర్ అనిత మాట్లాడుతూ తూనికల కొలతలలో జరిగే మోసల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంపెనీ ప్యాకెట్స్ మీద ఎంఆర్పి రేటు మరియు మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ మరియు ఎక్స్పైస్ డేట్ మరియు ఎఫ్ఎస్ఎస్ కోడ్ మరియు కస్టమర్ కేర్ నెంబర్ గల ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు. తూనికల కొలతల టెక్నీషియన్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

## ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు వినతి

**మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ ను కోరిన ఎమ్మెల్యే బీవి జయ నాగేశ్వర్ రెడ్డి**

– – – విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 19–కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వర్ రెడ్డి కోరారు. వెలగపూడి సచివాలయం లోని న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ పేషీ కార్యాలయంలో ఎమ్మిగనూరు న్యాయవాదుల సంఘం ప్రతినిధులతో కలిసి మంత్రి ఫరూక్ ను ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి కలిశారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు అవసరం, ఆవశ్యకతలపై న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఎమ్మిగనూరు దివంగత టిడిపి నేత బివి మోహన్ రెడ్డి తో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధం ను మంత్రి ఫరూక్ ఎమ్మెల్యే జయ నాగేశ్వర్రెడ్డి తో పంచుకున్నారు. ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వంలో బివి మోహన్ రెడ్డి తో కలిసి కీలకమైన మంత్రిత్వ శాఖలకు ప్రాతినిధ్యం వహించడం, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులకు సంక్షేమ కార్యక్రమాలకు తామిద్దరం చేసిన కృషిని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుపై వీలైనంత త్వరగా కార్యాచరణ బద్ధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి కి , న్యాయవాదుల సంఘం ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190